క్లుప్తంగా

20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

వాల్మీకిపురం: స్థానిక పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని, ఈ నెల 20వ తేదీ వరకు గడువు ఉందని కళాశాల ప్రిన్సిపల్ ఉమా అమరేశ్వరి తెలిపారు.కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, సిరికల్చర్, ఎంఅండ్‌ఏటి, ఎంఎల్‌టి గ్రూపులు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీ లోపు పాఠశాలలో సంప్రదించి, అడ్మిషన్లు పొందాలని ఆమె సూచించారు.

10న పూర్వ విద్యార్థుల సమావేశం

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఈనెల 10వతేదీన పూర్వ విద్యార్థుల సమావేశం జరగనుంది ఈ విషయాన్ని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు తేజ, సభ్యులు ఫర్‌హత్, రాజేశ్వరి గురువారం తెలిపారు. కాలేజీలో ఉదయం 10.30 గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు. 1984లో ప్రారంభమైన కాలేజీలో పలువురు విద్యార్థినులు విద్యను అభ్యసించారన్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారు సమావేశానికి హాజరుకావాలని. కాలేజీ అభివృద్ధికి సలహాలు,సూచనలు ఇవ్వాలని కోరారు.

సర్టిఫికెట్లు పారదర్శకంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ భీమేశ్వర్‌రావు

పీలేరురూరల్ : గ్రామ సచివాలయాల ద్వారా సర్టిఫికెట్లు పారదర్శకంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు తెలిపారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గ్రామ సచివాలయ సిబ్బందికి, మీ సేవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కేంద్రాలోనూ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తులు అప్‌లోడ్ చేసి విద్యార్థులకు, ప్రజలకు అందజేయాలన్నారు. 2023 డీకేటీ భూములను గత ప్రభుత్వం క్రమబద్ధీకరించిందన్నారు. అయితే ఈ ప్రభుత్వ అనుమతి వచ్చే వరకు ఎలాంటి ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టరాదన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



పొలంబడి కార్యక్రమంలో అధికారులు

పీలేరురూరల్ : వేరుశనగ సాగులో మేలైన యాజమాన్యపద్ధతులు పాటించాలని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. గురువారం మండలంలోని కావలిపల్లె పంచాయతీ బోడినాయునిదొడ్డిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తే తక్కువ ఖర్చుతో మంచి దిగుబడి వస్తుందన్నారు. దిబ్బ ఎరువు 100 కిలోలు, 10 కిలోల వేప పిండి, 2 కిలో ట్రైకోడెర్మావిరిడీ పొరలు పొరలుగా చేసి ప్రతి రోజు తేమ ఉండేలా నీడలో నీటి చల్లితే పది రోజుల తరువాత తెల్లటి బూజు పడుతుందని, దీని వివిధ పంటలకు వేసుకుంటే వేరుపురుగు నివారించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవో రమాదేవి, రైతుసేవ కేంద్ర సిబ్బంది, సేంద్రియ వ్యవసాయ సిబ్బంది సుధారాణి, ఏఈవో నజీర్ రైతులు పాల్గొన్నారు.

సబ్జెక్టుపై పట్టు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్ సవాలి

కుర బలకోట: రాత పరీక్షలో ప్రతిభ చూపినప్పటికీ ఇంటర్వ్యూల వద్దకు వచ్చే సరికి చాలా మంది అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారని బెంగళూరు సొసైటీ జనరల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కోచ్, ఎజైల్ మాస్టర్ రవీంద్రనాథ్ సవాలి అన్నారు. ఇంటర్వ్యూలు ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తొలుత ఉద్యోగానికి వెళ్లే సంస్థ గురించి తెలుసుకుని ఉండాలన్నారు. వివిధ సర్టిఫికెట్లు, పత్రాలు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు సరైనా వస్త్రధారణ ఉండాలన్నారు. సబ్జక్టుపై పట్టు ఉండాలన్నారు. సమయపాలన తో పాటు హుందాగా వ్యవహరించాలన్నారు. హావభావాలు కాన్ఫిడెంట్‌గా ఉండాలన్నారు. ఆత్మ విశ్వాసం ఇనుమడించాలన్నారు. అడిగిన వాటికి నేరుగా సూటిగా సమాధానం చెప్పాలన్నారు. రెజ్యూమ్‌లో ఉన్న వివరాలనే ఇంటర్వ్యూలలో చెప్పాలన్నారు. వీటికి తోడు స్కిల్స్ ఉంటే సులభంగా ఇంటర్వ్యూలలో రాణించి జాబ్ కొట్టవచ్చన్నారు.

యువతా మేలుకో.. భవితను మలుచుకో

- ప్రారంభమైన ఇంజినీరింగ్ తరగతులు
- నూతన విద్యార్థులను వెంటాడుతున్న ర్యాగింగ్ భయం
- విద్యా సంస్థల్లో విస్తరిస్తున్న విష సంస్కృతి

ఇంజినీరింగ్ కాలేజీల వివరాలు0	
మదనపల్లె	1
అంగళ్లు	3
కలికిరి	1
పీలేరు	1



ర్యాగింగ్ చేయబోమని ప్రతిజ్ఞ చేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు

మదనపల్లె సిటీ: విద్యాలయాల్లో ర్యాగింగ్ భూతం విస్తరిస్తోంది. సీనియర్ల రూపంలో జూనియర్ విద్యార్థులను వేధిస్తోంది. సరదా పేరిట సాగిస్తున్న ఆకతాయిల వికృత చేష్టలకు నవతరం బెంబేలెత్తుతోంది. బంగారు భవిష్యత్తును ఊహించుకుంటూ కళాశాలలో అడుగుపెట్టిన పిల్లలను అంధకారంలోకి నెట్టేస్తోంది. మానసికంగా కుంగిపోయిన కొందరు విద్యార్థుల ప్రాణాలను సైతం హరిస్తోంది. ఎన్నో కలలతో బిడ్డలను కాలేజీకి పంపిన తల్లిదండ్రులకు తీరని వేదన మిగులుస్తోంది. ఉన్నత విద్యావంతులే విపరీత పోకడలకు పోవడం విద్యావేత్తలను ఆందోళనకు గురి చేస్తోంది. చాప కింద నీరులా వ్యాపిస్తున్న ఈ విష సంస్కృతికి అడ్డుకట్టవేయాల్సిన తరుణం ఆసన్నమైంది. యువతే మేలుకుని..తమ భవితను ఉత్తమంగా మలుచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కోటి ఆశలతో అడుగులు

కోటి ఆశలతో ఫ్రెషర్స్ కళాశాలల్లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ర్యాగింగ్ భయం విద్యార్థులను, తల్లిదండ్రులను వణికిస్తోంది. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ర్యాగింగ్ సంస్కృతి తక్కువే అని చెప్పవచ్చు. కానీ తరచూ ఎక్కడో ఒక చోట ఈ వికృతం కొనసాగుతూనే ఉంది. సుమారు 40 శాతం మంది ఏదో రకంగా ర్యాగింగ్ బారిన పడుతున్నారనేది అక్షర సత్యం. యాజమాన్యాల జోక్యం, విద్యార్థులు, తల్లిదండ్రులు అభ్యర్థన, రాజీ వంటి కారణాలతో కొన్ని కేసులు నమోదు కాలేదు. యూజీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌లో దేశవ్యాప్తంగా కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం ర్యాగింగ్ నిరోధక చట్టం–1997 తీసుకొచ్చింది. దీని తీవ్రతను బట్టి పోలీసులు కేసులు నమోదు చేస్తారు. నిందితుడికి ఏడాది నుంచి జీవితఖైదు వరకు శిక్ష పడే అవకాశం ఉంటుంది. మదనపల్లె పరిసర ప్రాంతాల్లోని ఇంజినీరింగ్ కాలేజీల్లో పోలీసుశాఖ ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై అవగాహన కార్యక్రామలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు దీనివల్ల కలిగే అనర్థాల గురించి వివరిస్తున్నారు.

నిరంతర పర్యవేక్షణ

విద్యా సంస్థల్లో విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అగాహన కల్పించాలి. ఎక్కడికక్కడ ఈ వికృత సంస్కృతి గురించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. విద్యా సంస్థల యాజమాన్యాలు అప్రమత్తంగా వ్యవహరించాలి. పోలీసుల నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వికృత చేష్టలకు పాల్పడేవారికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకుంటాం.

-కొండయ్యనాయుడు, డీఎస్పీ, మదనపల్లె

ఫ్రీహోల్డ్ పట్టాలు పరిశీలించిన సబ్ కలెక్టర్



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : సీటీఎం గ్రామంలో ఫ్రీ హోల్డ్ పట్టాలను గురువారం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ రీ వెరిఫికేషన్ చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి, పేదలను బెదిరించి, కబ్జాలకు పాల్పడి భూములను లాగేసుకున్నారంటూ పెద్ద సంఖ్యలో సబ్ కలెక్టరేట్‌కు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటన్నింటిపై పూర్తి పరిశీలన జరపాలని నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా మండలంలోని సీటీఎం గ్రామానికి చెందిన యస్.అల్లిబాషా(నబిసాబ్), షేక్ మహమ్మద్ అలీ(హైదర్‌సాబ్)కు చెందిన సర్వే నంబర్లు.1493/1, 1493/2, 1493/3లోని 22ఏ, అసైన్డ్‌భూముల నుంచి 2023లో రెవెన్యూ అధికారులు ఫ్రీ హోల్డ్ చేశారు. వీటికి సంబంధించిన రెవెన్యూ రికార్డులు, అడంగల్, 1బి, అనుభవ ధృవీకరణ పత్రాలను సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి పట్టాభిరాముడి పట్టాభిషేక మహోత్సవాలు



పట్టాభిషేక మహోత్సవాలకు సిద్ధమౌతున్న రామాలయం

వాల్మీకిపురం: పట్టణంలోని శ్రీ పట్టాభిరామాలయంలో ఈ నెల 9వ తేదీ నుంచి టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారి పట్టాభిషేక మహోత్సవాలు జరగుతాయని ఆలయ అధికారులు క్రిష్ణమూర్తి, నాగరాజ తెలిపారు. 9న (శుక్రవారం) సాయంత్రం అంకురార్పణ జరుగుతుందన్నారు. మొదటి రోజు సేనాధిపతి ఉత్సవం, 10న యాగశాల పూజ, స్నపన తిరుమంజనం, సాయంత్రం 5 గంటలకు ఊంజల్‌సేవ, 6:30గంటలకు శ్రీ సీతారామ శాంతి కల్యాణం, రాత్రి 8గంటలకు హనుమంత వాహనసేవ, 11న ఆదివారం ఉదయం యాగశాల పూజ, స్నపన తిరుమంజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం శ్రీరామ పట్టాభిషేక మహోత్సవం, గరుడ వాహనంపై పట్టాభిరాముడి నగరోత్సవం కార్యక్రమాలు జరగనున్నాయి. భక్తులు రూ.300 చెల్లించి శ్రీరామ పట్టాభిషేకం అర్జిత సేవలో పాల్గొనవచ్చునని తెలిపారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ కొండయ్యనాయుడు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

మదనపల్లె : యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా ఉన్నత విద్యను అభ్యసించాలని డీఎస్పీ డి.కొండయ్యనాయుడు అన్నారు. అన్నమయ్యజిల్లా పోలీస్, మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో డ్రగ్స్ రహిత ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... విద్యార్థులు మత్తుపదార్థాలకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో డ్రగ్స్ సేవిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ సమాచారం తమకు అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు., సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. టోల్ ఫ్రీ నెం .14500కు సమాచారం అందించాలన్నారు. మదనపల్లె సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయాలు అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటుచేశామన్నారు. జ్ఞానాంబిక కరస్పాండెంట్ డాక్టర్.రాటకొండ గురుప్రసాద్ మాట్లాడుతూ..యువత మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల తమ జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. టూటౌన్ సీఐ యువరాజు మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురభి రమాదేవి, హెడ్ కానిస్టేబుల్ డి.జి.రామమూర్తి, అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

మదనపల్లె సిటీ: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని జిల్లా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అమరనాథ్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో ఎన్ఎస్ఎస్,జువాలజీ విభాగాల ఆధ్వర్యంలో మత్తుపానీయాల వాడకం, నివారణపై అవగాహన కార్యక్రమం జరిగింది. యువకులు దురవాట్లకు బానిసలు కావడంతో పలు అనర్థాలకు దారి తీస్తుందన్నారు. సైకాలజిస్టు డాక్టర్ రాధిక మాట్లాడుతూ విద్యార్థినులు అవగాహన కలిగి సమాజంలో మార్పుకు ప్రయత్నించాలని సూచించారు. పొగాకు వ్యసనం నుంచి బయట పడేందుకు ప్రభుత్వాస్పత్రిలో ఉన్న మందులు గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, అధ్యాపకులు మోహన్‌వల్లి, విష్ణుప్రియ,ఖాజావల్లి తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు తప్పనిసరిగా న్యాయం చేస్తాం



అమ్మచెరువుమిట్టలో ఆక్రమణదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఖాజాబీ

మదనపల్లె : ఇల్లు లేని నిరుపేదలందరికీ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తప్పనిసరిగా న్యాయం చేస్తామని తహసీల్దార్ ఖాజాబీ తెలిపారు. గురువారం అమ్మచెరువుమిట్టలో ప్రభుత్వ స్థలంలో అక్రమంగా గుడిసెలు ఏర్పాటుచేసుకున్న వారిని తొలగించాల్సిందిగా రెవెన్యూ అధికారులు కోరారు. దానికి వారు ఇళ్ల స్థలాల కోసం కొన్నేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని, ప్రభుత్వ స్థలం కావడంతో తాము గుడిసెలు వేసుకున్నామన్నారు. దీనిపై తహసీల్దార్ ఖాజాబీ మాట్లాడుతూ...ఆక్రమిత స్థలం పాల ఏకరి సంక్షేమ సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి కేటాయించడం జరిగిందన్నారు. ఇల్లు లేని పేదలు తమ ఆధార్‌కార్డులు సమర్పిస్తే, ప్రభుత్వ నిబంధనల మేరకు స్థలాల కేటాయింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంతే తప్ప దౌర్జన్యంగా ప్రభుత్వ స్థలంలో ఆక్రమణలకు పాల్పడితే ఊరుకునేది లేదన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు, ఆక్రమణదారులకు కొంతసేపు వాగ్వాదం జరిగింది. తర్వాత పోలీసులు రంగప్రవేశం చేసి, సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. కార్యక్రమంలో తాలూకా సీఐ ఎస్.శేఖర్, ఆర్ఐ రెడ్డెప్ప, సర్వేయర్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టమాటా పంటకు ఆకుమాడు తెగులు



ఊజిరోగంతో రంధ్రాలు పడిన టమాటాలు



ఆకుమాడు తెగులుతో దెబ్బతిన్న తోట

గుర్రంకొండ: ఇటీవల కురిసి వర్షాలతో టమాట పంటకు ఆకుమాడు తెగులు సోకింది. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో తోటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో మండలంలో 1750 హెక్టార్లలో టమాట సాగు చేశారు. తోటలకు తెగులు సోకిన రెండుమూడు రోజులకే నల్లగా మారిపోతున్నాయి. చెట్టు మొదలు భాగం నుంచి పై వరకు ఆకు నల్లగా మారిపోతోంది.చెట్టుకు ఉన్న కాయలు మొత్తం రాలిపోయి కాలువల్లో పడిపోతున్నాయి. దీంతో తెగులు నివారణ మందుల భారం రైతులపై పడుతోంది. ఎకరం తోటకు నివారణ మందులు పిచికారీ చేయాలంటే రూ.11 వేలు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. మరోవైపు ఊజి రోగంతో టమాట తోటలు దెబ్బతింటున్నాయి. కాయలు రంధ్రాలు పడిపోతున్నాయి. ఊజి దోమకాటుకు గురైన కాయలకు మార్కెట్లో డిమాండ్ ఉండదు. దీంతో రైతులు కాయలు కోసి తోటల వద్దే పారబోస్తున్నారు. పంట చేతికొచ్చే సమయంలో తెగుళ్ల సోకడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొగాకుతో క్యాన్సర్ రావడం ఖాయం

రాజంపేట టౌన్ : పొగాకు వల్ల మనిషికి క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.పురుషోత్తం తెలిపారు. ఎన్ఎస్ఎస్, జంతు శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్‌లో భాగంగా డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. పొగాకు వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. చెడు అలవాట్లు విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని చెప్పారు. యువత పొగాకు దూరంగా ఉండాలన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి పూజలు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి వారి ఆలయంలో నాగుల చవితి పూజలు ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువారం ఆలయంలోని ఈఓ డివి రమణారెడ్డి ఆధ్వర్యంలో నాగచతుర్థి సందర్భంగా నాగుల పుట్ట వద్ద ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణయ్య స్వామి, శంకరయ్య స్వామి, శేఖర్ స్వామి, మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో పుట్టకు పూజలు చేశారు.

రెడ్డిసంఘం నూతన కమిటీ ఏర్పాటు



నూతన కమిటీ నాయకులు

కురబలకోట: మండలంలోని చేనేతనగర్‌లో గురువారం నూతనంగా రెడ్డి సంఘం ఏర్పాటైంది. కమిటీ కీలక నాయకులుగా ఎస్. కృష్ణారెడ్డి, కె. ఆనందరెడ్డి, వై. భాస్కర్ రెడ్డి, వి. భాస్కర్ రెడ్డి, జి. అరవిందరెడ్డి, ఆలయ పెద్దలుగా జి. మల్‌రెడ్డి, జి. సోమశేఖర్‌రెడ్డి, జి. లోకేశ్వర్ రెడ్డి, పి.శివారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా ఆర్. అమరనాధరెడ్డి, మద్దిరెడ్డి,కుమార్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కృష్ణారెడ్డి, ఆనందరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, చంద్ర. మధుకర్, వెంకట్రమణారెడ్డి, బయ్యారెడ్డి, గోపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు కమిటీ నాయకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

పీలేరు : మండలంలోని ఎర్రగుంటపల్లె పంచాయతీ ముడుపులవేములవారిపల్లె ఎస్సీ కాలనీలో సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఎస్సీ కాలనీలోని సమస్యలపై భారతీయ అంబేడ్కర్ సేన జిల్లా కోకన్వీనర్ పాలకుంట శ్రీనివాసులు జిల్లా పంచాయతీ రాజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి ఆదేశాల మేరకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగరాజునాయక్, విద్యుత్ శాఖ ఏఈ రామ్మూర్తి, సర్పంచ్ చంద్రారెడ్డి గ్రామాన్ని సందర్శించారు. తాగునీటి, విద్యుత్ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు తుమ్మల ధరణికుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు



మదనపల్లె జెడ్పీహెచ్ఎస్‌లో ప్రమాణం చేస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మదనపల్లె అర్బన్, రూరల్ మండల పరిధిలోని 137 పాఠశాలల్లో 135 పాఠశాలకు ఎన్నికలు పూర్తి చేసినట్లు ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాల, మేడిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో ఎన్నికలు వాయిదా పడ్డాయి. మధ్యాహ్నం చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా చంద్రకళ, వైస్ చైర్మన్‌గా పఠాన్ అక్బర్‌ఖాన్ ఎన్నికైనట్లు హెచ్ఎం సుబ్బారెడ్డి తెలిపారు. ఉర్దూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మహమ్మదీ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా జీనత్ ఎన్నికైనట్లు హెచ్ఎం షాజహాన్ తెలిపారు. వివేకానంద (రాంరెడ్డిలేవుట్) మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చైర్మన్‌గా బి.వెంకటభాగ్యలక్ష్మి, వైస్ చైర్మన్‌గా బాలాజీనాయక్ ఎన్నికైనట్లు హెచ్ఎం రాజేంద్రప్రసాద్ తెలిపారు.వివేకానంద (మాయబజార్) మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చైర్మన్‌గా అంజలి, వైస్ చైర్మన్‌గా రవీంద్రనాథ్‌రెడ్డి ఎన్నికైనట్లు హెచ్ఎం శ్రీనివాసులు తెలిపారు. మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా వెంకటేష్, వైస్ చైర్మన్‌గా హేమావతి ఎన్నికైనట్లు హెచ్ఎం తెలిపారు.

నిమ్మనపల్లె మండలంలో..

నిమ్మనపల్లె : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎంపీడీవో షాలెట్, ఎంఈఓ లు ఎమ్మార్ పద్మావతి, నారాయణ, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. మండలంలోని పాఠశాలల్లో అధిక శాతం స్కూల్ కమిటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం కాగా, కొన్ని పాఠశాలలో ఎన్నిక ద్వారా ఎస్ఎంసీ కమిటీలను ఏర్పాటు చేశారు. నిమ్మనపల్లె జెడ్పీ హైస్కూల్ తెలుగు చైర్మన్ గా నాగులయ్యగారి పల్లెకు చెందిన ఎం.కృష్ణయ్య , వైస్ చైర్మన్ గా వెంకోజిగారి పల్లెకు చెందిన రెడ్డి శిల్ప, రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గా జే.సోమశేఖర్ రెడ్డి, వైస్ చైర్మన్ గా డి.పద్మజ, నిమ్మనపల్లె జడ్పీ హైస్కూల్ ఉర్దూ కమిటీ చైర్మన్గా షేక్ సబీనా వైస్ చైర్మన్ గా ముఖ సిద్దిక్ అలీ ఖాన్, జడ్పీ హైస్కూల్ బాలినాయని పల్లె కమిటీ చైర్మన్గా ఆర్ చిన్న రెడ్డప్ప వైస్ చైర్మన్ గా ఎం విజయ, రెడ్డివారిపల్లె జడ్పీ హైస్కూల్ ఎస్ఎంసి కమిటీ చైర్మన్‌గా జి శిరీష వైస్ చైర్మన్ గా బి హరి, ముష్టూరు కస్తూరి విద్యాలయం ఎస్ఎంసి కమిటీ చైర్మన్ గా ఎం శ్రీనివాసులు వైస్ చైర్మన్ గా టి సుధాకర్ ఎన్నికయ్యారు.

రామసముద్రమం మండలంలో..

రామసముద్రం: మండలంలో 80 ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు ఎంఈవో హేమలత తెలిపారు. చెంబకూరు జెడ్పి ఉన్నత పాఠశాలలో చైర్మన్‌గా బి.శంకర, మట్లవారిపల్లి హైస్కూల్‌లో టి.కృష్ణప్ప, అరికెల హైస్కూల్‌లో భువనేశ్వర్‌రెడ్డి, కెసి.పల్లి హైస్కూల్‌లో పి.రెడ్డెప్పరెడ్డి, రామసముద్రం హైస్కూల్‌లో పీ. రెడ్డెప్ప రెడ్డి, రామసముద్రం హైస్కూల్ లో ఆర్. చాంద్ భాషా, మోడల్ స్కూల్లో బాలాజీ, కస్తూర్బా బాలికల పాఠశాలలో సరస్వతిలను చెర్మన్లుగా ఏకగ్రీవంగా కమిటీ సభ్యులు ఎన్నుకున్నట్లు తెలిపారు.

మూడు పాఠశాలల్లో వాయిదా

పెద్దమండ్యం: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. 47 ప్రాథమిక పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 5 ఉన్నత పాఠశాలలు, కేజీబీవి, మోడల్ పాఠశాలలు మండలంలో ఉన్నాయి. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎన్నికలు సజావుగా జరిగాయి.యల్లంవారిపల్లె, కలిచెర్ల ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్‌లో ఎన్నిక వాయిదా పడింది. మోడల్ పాఠశాలలో జరగిన ఎన్నిక ఉత్కంఠ రేపింది. తరగతుల వారీగా సభ్యులను ఎన్నుకొంటుండగా పదోతరగతిలో విద్యార్థుల తల్లిదండ్రులు తక్కువగా వచ్చారు. అయితే కొందరు చోటా నాయకులు మేము ఇచ్చిన పేర్లను నమోదు చేసుకుని ఎన్నిక పూర్తి చేయాలని అధికారులను పట్టుబట్టారు. పాఠశాల వద్ద ఒక దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకొనడంతో ములకచెరువు సీఐ తమ్మిశెట్టి మధు తమ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. సాయంత్రం వరకు ఎన్నికపై ఉత్కంఠత నెలకొంది.

తంబళ్లపల్లె మండలంలో..

తంబళ్లపల్లె: మండలంలో గురువారం ప్రభుత్వ పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు ముగిసినట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. 68 పాఠశాలల్లో ఆయా హెచ్ఎం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. 66 పాఠశాలల్లో పేరెంట్స్ ఆమోదంతో కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు. కన్నెమడుగు ఉన్నత పాఠశాల, ఎద్దులవారికోట యూపీ పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయి. మండల కేంద్రంలోని పాఠశాల కమిటీ చైర్మన్ ఆనంద్, కేజీబీవీ చైర్మన్ మల్లీశ్వరి, తంబళ్లపల్లె జెడ్పీ హెచ్ఎస్ చైర్మన్ శివకుమార్, మోడల్ స్కూల్ చైర్మన్‌గా వాణి ఎన్నికయ్యారు.

కోరం లేక ఆగిన ఎన్నిక

కలకడ : కలకడ ఆదర్శపాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నిక కోరం లేక వాయిదా వేసినట్లు ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లి గురువారం తెలిపారు. స్థానిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో 6,7 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులు కోరం మేరకు హాజరుకావడంతో వారిలో కమిటీ సభ్యులను ఎంపిక చేయడం జరిగిందని, 7,8,9 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులు కోరం మేరకు లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అయితే కోరం లేకపోయినా ఎన్నిక జరపాలని ఒక వర్గం పట్టుపట్టారు. పోలీసులు వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు. కోన జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు సి.హారతిని చెర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయులు చంగల్‌రాయుడు తెలిపారు.

గుర్రంకొండ మండలంలో..

గుర్రంకొండ: మండలంలోని 48 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈవో సురేంద్రబాబు తెలిపారు. అన్ని పాఠశాలల్లో కమిటీ ఎన్నికలు విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా నిర్వహించారన్నారు.

కేవీపల్లె మండలంలో..

కేవీపల్లె : మండలంలో 51 ప్రాథమిక పాఠశాలలు, 9 ప్రాథమికోన్నత పాఠశాలలు, 13 ఉన్నత పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు జరిగినట్లు ఎంఈవో రెడ్డిబాషా తెలిపారు. 69 పాఠశాలల్లో చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని, 4 పాఠశాలల్లో ఓటింగ్ ద్వారా ఎన్నిక జరిగినట్లు తెలిపారు.

కలికిరి:మండల పరిధిలోని 51 ప్రాథమిక, నాలుగు ప్రాథమికోన్నత, ఎనిమిది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయని ఎంఈఓ కరీముల్లా తెలిపారు.

బడికాయలపల్లెలో పెండింగ్

బి.కొత్తకోట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు బడికాయలపల్లె హైస్కూల్ మినహా మిగిలిన చోట్ల జరిగాయి. మండలంలో 52 ప్రాథమిక, ఆరు ప్రాథమికోన్నత, 10 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిలో బడికాయలపల్లె హైస్కూల్‌లో హెచ్ఎం చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలను నిర్వహించలేదు. సాయంత్రం వరకు కాలయాపన చేసి ఎన్నికను వాయిదా వేశారు. దీనికి సరైన కారణాలు చెప్పకపోవడంతో ఎన్నికైన సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన 67 పాఠశాలల్లో చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నిక పూర్తి చేశామని ఎంఈవో రెడ్డిశేఖర్ తెలిపారు.

కురబలకోట మండలంలో..

కురబలకోట: మండలంలోని 45 ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ఎస్ఎంసీ ఎన్నికలు సజావుగా సాగాయి. అంగళ్లు జెడ్పీ హైస్కూల్ విద్యా కమిటీ చైర్మన్‌గా గుర్రాల వెంకటాద్రి, తెట్టు హైస్కూల్‌కు మురళి, ముదివేడు హైస్కూల్‌కు బావాజాన్, మోడల్ స్కూల్‌కు చంద్రశేఖర్, కురబలకోట జడ్పీ హైస్కూల్ మహమ్మద్. ఆలీ, కేజీబీవీ స్కూల్‌కు రెడ్డెప్ప, చేనేతనగర్ గురుకుల పాఠశాలకు జి. అరుణ చైర్మన్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎంఈఓ ద్వారకనాథ్ తెలిపారు. మండలంలో 38 పాఠశాలల్లో ఏకగ్రీవంగా మరో ఏడు పాఠశాలల్లో చేతులు ఎత్తే పద్ధతిలో కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు.